JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | శుక్రవారం 26-06-2026
Medchal - Malkajgiri | Friday 26-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 | సంచిక : 25
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 25 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com




రాజకీయాల్లో అత్యంత అరుదైన, దక్షిణాది జలవనరుల చరిత్రలోనే ఒక అపూర్వ మైలురాయిగా నిలిచే చారిత్రాత్మక ఘట్టానికి కృష్ణానది ఉపనది అయిన తుంగభద్ర వేదికైంది. కర్ణాటకలోని విజయనగర జిల్లా హోసపేట సమీపంలో గల మునిరాబాద్ వద్ద తుంగభద్ర జలాశయానికి పూర్తిగా పునరుద్ధరించిన 33 నూతన స్పిల్‌వే క్రస్ట్ గేట్లను గురువారం ఘనంగా జాతికి అంకితం చేశారు.

## తుంగభద్ర సమస్య ఇప్పటిది కాదు

- నదుల అనుసంధానంతోనే ప్రగతి
- తుంగభద్ర గేట్లు ప్రారంభించిన ముగ్గురు సీఎంలు
- ఎల్ నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తగ్గుతున్న తరుణం.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- కేవలం రైతుల శ్రేయస్సు కోసమే సమస్యలను పరిష్కరించుకోవాలని స్పష్టం.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- రైతాంగానికి రక్షణ కవచం.. కర్ణాటక సీఎం డీకే శివకుమార్
- దక్షిణాది రాష్ట్రాల ఐక్యత దేశానికే ఆదర్శం.. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్

**జయభేరి, బెంగళూరు, జూన్ 25 :**

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ కలిసి సంయుక్తంగా ఈ గేట్లను ప్రారంభించారు. గతంలో చోటుచేసుకున్న జల విపత్తును సవాల్‌గా తీసుకుని, మూడు రాష్ట్రాల సమన్వయంతో రికార్డు సమయంలో దాదాపు రూ. 51 కోట్ల వ్యయంతో ఈ ఆధునిక గేట్ల మార్పిడి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.గేట్ల ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలు ఒకే వేదికపైకి రావడం చారిత్రాత్మక అంశమన్నారు. "తుంగా పానం.. గంగా స్నానం" అనే సామెతను గుర్తు చేస్తూ, తుంగభద్ర నీరు అంత పవిత్రమైనదని కొనియాడారు. గతేడాది 19వ గేట్

...మిగతాది 2 లో

## కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ నాశనం




- రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లింది.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి
- రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారు
- తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

**జయభేరి, హైదరాబాద్, జూన్ 25 :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.5060 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.కేసీఆర్ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్‌స్పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా

...మిగతాది 2 లో

## కృష్ణా, తుంగభద్రలో మన వాటాను కాపాడుకుందాం



- నడిగడ్డకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉంది
- తెలంగాణ రక్షణ సేన ఛీఫ్ కవిత

**జయభేరి, హైదరాబాద్ :**

తుంగభద్రలో మన నీటి వాటాకు తూట్లు పొడిచే పనికి రేవంత్ మద్దతుందని తెలంగాణ రక్షణ సేన ఛీఫ్ కవిత అన్నారు. ఆర్డీఎస్ చుట్టు కర్ణాటక చేపట్టే ప్రాజెక్ట్ లతో మనం నీటి హక్కును కోల్పోతాం. మన హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి.. కర్ణాటక దోపిడీకి వంత పాడుతున్నాడు. ఆర్డీఎస్ మీద నిర్మించి ప్రాజెక్ట్ ల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వెళ్లవద్దు. బదులుగా సెంట్రల్ వాటర్ కమిషన్ వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లి పోరాటం చేయాలని అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు అన్యాయం చేయవద్దు. తెలంగాణ సాధించుకొని 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా మనం పూర్తిస్థాయిలో కృష్ణా, తుంగభద్రలో మన నీటిని వాడుకోలేదు. ఆర్డీఎస్ ప్రాజెక్ట్ నడిగడ్డను బతికించి...ఉమ్మడి

...మిగతాది 2 లో



## అన్ని విధాలా అండగా ఉంటాం

- అతలాకుతలం చేసిన జంట భూకంపాలు
- ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మోదీ
- అన్ని రకాల మానవీయ, వైద్య సహాయసహకారాలను అందిస్తామన్న ప్రధాని

**జయభేరి, న్యూఢిల్లీ:**

భీకర జంట భూకంపాలు వెనెజువెలా దేశాన్ని అతలాకుతలం చేశాయి. ఈ శతాబ్ద కాలంలోనే అత్యంత శక్తిమంతమైనవిగా నమోదైన ఈ భూకంపాల విధ్వంసంపై భారత ప్రధానమంత్రి మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా మోదీ స్పందిస్తూ... విపత్తు బాధితులకు, వెనెజువెలా ప్రభుత్వానికి భారతదేశం తరఫున ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కష్టకాలంలో వెనెజువెలాకు అవసరమైన అన్ని రకాల మానవీయ, వైద్య సహాయసహకారాలను అందించేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు. వెనెజువెలాలోని మోరోన్ నగరానికి పశ్చిమంగా కేవలం ఒక్క నిమిషం వ్యవధిలోనే 7.2 మరియు 7.5 తీవ్రతతో ఈ జంట భూకంపాలు సంభవించినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది.

...మిగతాది 2 లో

## రాజ్యసభలో కోటీశ్వరులు

- రూ.5,300 కోట్లతో బీఆర్ఎస్ ఎంపీ టాప్..


2 లో

## తెలంగాణలో కొత్త పింఛన్ల జారీ

- వచ్చే నెల నుంచి కొత్త పింఛన్లు
- ఈ నెలాఖరుకు సర్వే పూర్తి

**జయభేరి, హైదరాబాద్, జూన్ 25 :**

తెలంగాణలో చేయూత పింఛన్ల పథకంపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పింఛన్ల పంపిణీపై కీలక అప్డేట్ ఇచ్చింది. వచ్చే నెల నుంచి కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని నిర్ణయించింది. అర్హులైనవారి నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. అనంతరం దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారికి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. అర్హులైన ప్రతీఒక్కరికీ పింఛన్లు అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. గ్రామాలు, పట్టణాల్లో సెర్ప్ అధికారులు సర్వే చేపడుతున్నారు. ఈ క్రమంలో తమకు అర్హత ఉన్నా పింఛన్లు ఇవ్వడం లేదని వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. తమకు పింఛన్లు అందించాలని వినతి పత్రాలు అందిస్తున్నారు.




ఈ క్రమంలో అర్హులైనవారికి కొత్త పింఛన్లను మంజూరు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. అయితే అనర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే చేపడుతోంది. ఈ సర్వే తుది దశకు చేరుకుంది. ఈ నెలాఖారుతో సర్వే ముగియనుండగా.. వచ్చే నెల నుంచి

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## సమస్య ఇప్పటిది కాదు

కొట్టుకుపోయినప్పుడు నిపుణుడు కన్నయ్య నాయుడు ద్వారా స్టాప్‌లాక్ గేట్ అమర్చి నీరు వృథా కాకుండా కాపాడామని, ఇప్పుడు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు కలిసి పనిచేసి మొత్తం 33 గేట్లను మార్చడం అభినందనీయమన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తగ్గుతున్న తరుణంలో నదుల అనుసంధానమే దేశానికి అన్‌స్టాపబుల్ వృద్ధిని ఇస్తుందని, ప్రధాని మోదీ నేతృత్వంలో వన్ నేషన్ వన్ గ్రిడ్ లాగే గోదావరి, కావేరి అనుసంధానం ద్వారా దక్షిణాది రాష్ట్రాల రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ కేవలం ఒక టెక్నికల్ విజయం మాత్రమే కాదని, మూడు రాష్ట్రాల కరువు జిల్లాల సమస్యల పరిష్కారానికి పడిన కీలక అడుగని అభివర్ణించారు.

ఏపీలోని కర్నూలు, అనంతపురం, తెలంగాణలోని మహబూబ్‌నగర్ ప్రజల వలసల బాధలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. రాష్ట్రాల మధ్య జల వివాదాల పంచాయతీలు పక్కనబెట్టి, కేవలం రైతుల శ్రేయస్సు కోసమే సమస్యలను పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు చట్టబద్ధంగా రావలసిన 10 టీఎంసీల నీరు ఇంకా రావడం లేదని ప్రస్తావిస్తూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ కింద ఉన్న తెలంగాణ రైతులకు న్యాయం జరిగేలా కర్ణాటక, ఏపీ రాష్ట్రాలు సహకరించాలని కోరారు. వివాదాలు వీడి పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే అంతిమంగా రైతులకు మేలు జరుగుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**రైతాంగానికి రక్షణ కవచం.. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ హర్షం**

ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్యామ్ నిర్మించిన 70 ఏళ్ల తర్వాత తొలిసారిగా పాత గేట్ల స్థానంలో హైగ్రేడ్ స్టీల్ గేట్లను అమర్చామని తెలిపారు. గతేడాది ప్రమాదం జరిగినప్పుడు కేవలం పాత గేటుకు ప్యాచ్ వర్క్ చేయకుండా, భవిష్యత్ తరాల భద్రతను దృష్టిలో ఉంచుకుని మొత్తం 33 గేట్లను మార్చేలా అంతరాష్ట్ర సమన్వయంతో బోర్డు నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు.

ఈ నూతన గేట్ల ఏర్పాటుతో రాబోయే సీజన్‌లో పూర్తి స్థాయిలో 105 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేందుకు జలాశయం సురక్షితంగా సిద్ధమైందన్నారు. కర్ణాటకలో 9 లక్షల ఎకరాలు, ఏపీలో 6 లక్షల ఎకరాలు, తెలంగాణలో 87 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సుస్థిరమైన సాగునీరు అందుతుందని, నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పూడికతీత అంశాలపై కూడా మూడు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరడం శుభపరిణామమని వారు పేర్కొన్నారు.

**దక్షిణాది రాష్ట్రాల ఐక్యత దేశానికే ఆదర్శం: కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్**

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ జల వనరుల నిర్వహణలోను, అంతరాష్ట్ర సమస్యల పరిష్కారంలోనూ ఏపీ, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు చూపిన చొరవ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, యూపీఎంపీల మధ్య 'కెన్‌బెత్వా' ప్రాజెక్ట్ తరహాలోనే దక్షిణాదిలోనూ గోదావరికృష్ణాకావేరి అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. మూడు రాష్ట్రాల రైతుల నీటి హక్కులను కాపాడుతూ, తాగునీటి ఎద్దడిని నివారించడమే లక్ష్యంగా కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్రాలకు పూర్తి సాంకేతిక, ఆర్థిక మద్దతును అందిస్తుందని భరోసా ఇచ్చారు.

## కాంగ్రెస్.. రియల్ ఎస్టేట్ నాశనం

మారిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలు తమ పాలనలో చేసిన అప్పుల లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమే ఖర్చయ్యాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## కృష్ణా, తుంగభద్రలో మన వాటాను కాపాడుకుందాం

మహబూబ్ నగర్ కు ఉపయోగపడే ప్రాజెక్ట్. ఆర్డీఎస్ లో మనకు 16 టీఎంసీల వాటా ఉంటే ఉమ్మడి రాష్ట్రంలో గానీ తెలంగాణ వచ్చిన తర్వాత గానీ 6 టీఎంసీల కన్నా ఎక్కువ వాడుకోలేదు. మన నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేందుకు ఆర్డీఎస్ చుట్టుపక్కల రిజర్వాయర్లను బలోపేతం చేయాల్సి ఉంది. కానీ దురదృష్టవశాత్తు ఆనాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్ సర్కార్ దాన్ని పట్టించుకోలేదు.

దీంతో నడిగడ్డకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉంది. మనకు ఆర్డీఎస్ లో 16 టీఎంసీలు వచ్చినట్లే ఏపీకి సుంకేశుల నుంచి 16 టీఎంసీల వాటా ఉంది. కానీ వాళ్లు దాన్ని 32 టీఎంసీలు చేసుకొని బీభత్సంగా నీటిని వాడుకుంటున్నారు. మనం మాత్రం ఆ పనిచేయలేదు. మనం మౌలిక సదుపాయాలు ప్రాజెక్ట్ లు కట్టుకునే లోపే కర్ణాటక తుంగభద్ర మీద మూడు ప్రాజెక్ట్ లు కడుతోంది. కురిడి, కల్పగల్ గ్రామాల్లో 2 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మిస్తోంది. ఆర్డీఎస్ కు 15 కి.మీ.ల ఎగువన చిక్కాలపర్వి వద్ద 2.50 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బ్యారేజ్ నిర్మిస్తోంది. ఆర్డీఎస్ కు దిగువన రాయచూరు జిల్లాలోని చిక్క మంచాల సమీపంలో 5 టీఎంసీల కెపాసిటీతో మరో బ్యారేజి నిర్మిస్తోంది. మొత్తంగా ఆర్డీఎస్ కు ఎగువన, దిగువ 10 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా కర్ణాటక ప్రాజెక్టులు చేపడుతోందని అన్నారు. వాస్తవానికి కర్ణాటకకు ఆర్డీఎస్ లో 1.20 వాటా నీళ్లు మాత్రమే ఉన్నాయి. కానీ పది టీఎంసీల నీళ్లు వినియోగించుకునే ప్రయత్న చేస్తోంది. అలాంటి కార్యక్రమానికి మన సీఎం రేవంత్ రెడ్డి వెళ్లి చంద్రబాబు, డీకే శివకుమార్ లను కూర్చొబెట్టుకోని మనకు అన్యాయం చేస్తున్నాడు.

కర్ణాటక ఈ ప్రాజెక్ట్ లను పూర్తి చేస్తే తుంగభద్రలో మన వాటా హక్కును పర్మినెంట్ గా కోల్పోతాం. అందుకే ఈ కార్యక్రమానికి రేవంత్ రెడ్డి వెళ్లొద్దు. బదులుగా ప్రొటెస్ట్ రూపంలో ఒక లేఖ రాయండి. మళ్లీ మీరు అధికారంలోకి రారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశంపై చర్యలు తీసుకుంటే మీ ముఖ్యమంత్రే మా ప్రాజెక్ట్ లకు అంగీకారం తెలిపారని కర్ణాటక వాదిస్తుంది. మీరు చేసే ఈ పని నడిగడ్డ ప్రజలకు అతి పెద్ద గుదిబండగా మారుతుంది. అందుకే సెంట్రల్ వాటర్ కమిషన్ దగ్గరకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లండి. అందరం కలిసి కేంద్రంతో మన నీటి వాటా హక్కుల కోసం పోరాడుదాం. కృష్ణా, తుంగభద్రలో మన వాటాను కాపాడుకుందాం. రాష్ట్రానికి శాశ్వతంగా తాగు, సాగు నీరు వచ్చేలా చేసుకుందామని అన్నారు.

## అన్ని విధాలా అండగా ఉంటాం

దీని ధాటికి రాజధాని కరాకస్ సహా పలు నగరాల్లో వందలాది భవనాలు కుప్పకూలాయి. ఈ భూకంపం సృష్టించిన వైబ్రేషన్స్ దాదాపు 1,700 కిలో మీటర్ల దూరంలో ఉన్న బ్రెజిల్‌లోని అమెజాన్ అటవీ ప్రాంతం వరకు కూడా తెలిసివచ్చాయంటే దీని తీవ్రత ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. భూకంపం సృష్టించిన నష్టంపై వెనెజువెలా తాత్కాలిక ప్రెసిడెంట్ డెల్సీ రోడ్రిగ్జ్ స్పందిస్తూ... పలు రాష్ట్రాల్లో భారీగా ఆస్తి నష్టం జరిగిందని, రాజధానిలోని ప్రధాన విమానాశ్రయమైన 'సిమోన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం' తీవ్రంగా దెబ్బతినడంతో దాన్ని పూర్తిగా మూసివేశామని ప్రకటించారు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో పాటు, పరిస్థితి దారుణంగా ఉండటంతో దేశంలోని హెల్త్ స్టాఫ్ (ఆరోగ్య సిబ్బంది) అందరూ అత్యవసర విధులకు హాజరుకావాలని 'మెడికల్ ఎమర్జెన్సీ' ఆర్డర్స్ జారీ చేశారు.

# చమురు ధరలు 50 డాలర్ల దిగువకు..?




సుదీర్ఘ కాలంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఇటీవల అమెరికా ఇరాన్ ఎట్టకేలకు తాత్కాలిక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేయగా కాస్త ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. దీంతో అప్పటినుంచి ముడి చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. గరిష్ఠ స్థాయిల నుంచి పెద్ద మొత్తంలో పతనమై ప్రస్తుతం 4 నెలల కనిష్ఠ స్థాయిలకు చేరడం ఊరట కలిగిస్తోంది. జూన్ 24న బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 75.45 డాలర్లకు పడిపోయింది. ఇవాళ ఒక్కరోజే 2 శాతానికి పైగా తగ్గింది. భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభం కాగా అప్పుడు 70 డాలర్ల స్థాయిలో ఉన్న క్రూడాయిల్ ధర భారీగా పెరుగుతూ వెళ్లింది. ఈ క్రమంలోనే ఒక దశలో ఏకంగా 126 డాలర్ల స్థాయికి ఎగబాకింది. దాదాపు 70 శాతానికిపైగా పెరిగిందని చెప్పొచ్చు. ప్రధానంగా చమురు రవాణాకు కీలకంగా ఉన్న హోర్ముజ్ జలసంధి మూతబడటంతో ఈ క్రమంలో నే పలు దేశాల్లో చమురు సంక్షోభం నెలకొంది. పలు దేశాల్లో ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయి. తర్వాత మొదట కాల్పుల విరమణ, తర్వాత ఒప్పందం దిశగా అడుగులు పడటంతో చమురు ధర తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు డీల్ కుదిరిన తర్వాత మరింత తగ్గుతూ వస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రతి బారెల్‌కు 78 డాలర్లకు పడిపోయి.. గత మూడు నెలల కనిష్ట స్థాయిని తాకినా భారత ప్రభుత్వం ధరలు తగ్గించకపోవడంపై సామాజిక మాధ్యమ వేదిక 'రెడ్డిట్' లోని ఇండియన్ స్టాక్ మార్కెట్ ఫోరమ్‌లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. అంతర్జాతీయంగా ధరలు తగ్గినా భారత్‌లో ఇంధన ధరలను తగ్గించకపోవడంపై నెటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశంలో చమురు ధరలు తగ్గకపోతే ద్రవ్యోల్బణం పెరిగి.. ఆర్థిక వృద్ధి మందగిస్తుందని... ప్రభుత్వం సామాన్యుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని కొందరు నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ డిబేట్‌లో వినియోగదారులపై పడుతున్న పన్నుల భారం ప్రధానంగా చర్చకు వచ్చింది. ముడిచమురు ధరలు పెరిగినప్పుడు లీటరుకు ఎనిమిది రూపాయల వరకు పెంచిన ప్రభుత్వం... ధరలు తగ్గినప్పుడు మాత్రం ఆ ప్రయోజనాన్ని ప్రజలకు బదిలీ చేయడం లేదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాల కోసం మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులను ప్రభుత్వం ఏటికేడు పిండేస్తోందని.. 2014 నాటి యూపీఏ ప్రభుత్వ కాలం నాటి వ్యతిరేక పరిస్థితులే ప్రస్తుత ప్రభుత్వంపై కూడా కనిపిస్తున్నాయని కొందరు కామెంట్ చేశారు. మరోవైపు.. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ ధరలకు, దేశాలు కొనుగోలు చేసే భౌతిక మార్కెట్ ధరలకు మధ్య వ్యత్యాసం ఉంటుందని కొందరు ఆర్థిక కోణాన్ని విశ్లేషించారు.

2026 మార్చిలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా 100 నుండి 110 డాలర్లకు పెరిగినప్పుడు... ఆ భారాన్ని ప్రభుత్వం వినియోగదారులపై పడకుండా కొంతకాలం నియంత్రించిందని ఒక నెటిజన్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఇంధన ధరల స్థిరత్వాన్ని కాపాడటం వల్లే భారీ యుద్ధ సమయాల్లో కూడా దేశంలో ధరలు అదుపులో ఉన్నాయని, తక్షణమే ప్రయోజనాలు ఆశించడం సరికాదనే వాదన కూడా వినిపించింది. ఇంధన ధరల నియంత్రణకు గానూ ప్రభుత్వం చేపడుతున్న ఇథనాల్ బ్లెండింగ్ విధానంపైనా రెడ్డిట్ వినియోగదారులు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చమురు ధరలు ఎంత తగ్గినా.. పెట్రోల్, డీజిల్ పరిమాణాన్ని తగ్గించి దాని స్థానంలో ఇథనాల్‌ను ఎక్కువగా కలుపుతున్నారని నెటిజన్లు ఆరోపించారు. దీనివల్ల సామాన్యుడికి ధరల భారం తగ్గడం లేదని... కేవలం ఇథనాల్ తయారుచేసే బడా వ్యాపారవేత్తలకు, పాలకుల కుటుంబాలకే లాభం చేకూరుతోందంటూ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఉద్దేశించి కొందరు ఘాటుగా విమర్శలు గుప్పించారు..

ఈ ఇంధన సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా ఈవీ అడాప్టేషన్ వైపు మారడమే ఏకైక మార్గమని కొందరు అభిప్రాయపడగా... అది అంత సులువు కాదని మరికొందరు గణాంకాలతో వివరించారు. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న 5 కోట్ల కార్లు, 26 కోట్ల ద్విచక్ర వాహనాలను ఈవీలుగా మార్చాలంటే దేశ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని మరో 600 నుండి 700 శాతం పెంచాల్సి ఉంటుందని... లేదంటే గ్రిడ్ వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏదేమైనా.. అంతర్జాతీయంగా తగ్గిన చమురు ధరల ప్రయోజనం దేశీయంగా సామాన్యుడికి అందడం లేదనేది ఈ మొత్తం చర్చ సారాంశం. ముడి చమురు ధర సమీప భవిష్యత్తులో మరింత తగ్గుతుందని భావిస్తుండగా, ఇది భారత్‌పై దిగుమతుల భారం తగ్గేలా చేస్తుంది. ధరలు నిరంతరాయంగా తగ్గుతుండటంతో, క్రూడాయిల్ బ్యారెల్‌కు 50 డాలర్ల కంటే కిందికి పడిపోతుందా అనే చర్చ తెరపైకి వచ్చింది. అయితే, సమీప భవిష్యత్తులో ధరలు అంతగా పడిపోయే అవకాశం లేదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతానికి మార్కెట్ కేవలం భౌగోళిక రాజకీయాల నుంచి డిమాండ్‌సప్లై సమీకరణాల వైపు మళ్లుతోంది. బ్రెంట్ క్రూడ్ రాబోయే రోజుల్లో 65 నుంచి 75 డాలర్ల పరిధిలో కదలాడవచ్చు. ధరలు 50 డాలర్ల దిగువకు వెళ్లాలంటే చైనా లాంటి పెద్ద దేశాల్లో డిమాండ్ దారుణంగా పడిపోవాలి, లేదా అంతర్జాతీయంగా చమురు నిల్వలు విపరీతంగా పేరుకుపోవాలి. ప్రస్తుతానికైతే అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. ఈ క్రమంలోనే రూపాయి విలువ పుంజుకోవడం సహా ద్రవ్యోల్బణం భయాలు కూడా తగ్గుముఖం పడతాయి. యుద్ధం ప్రారంభం నాటి నుంచి గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న చమురు నౌకలు/ట్యాంకర్లు ఇప్పుడు హోర్ముజ్ జలసంధిగుండా రాకపోకలు ప్రారంభించాయి. ఇది మరింత సానుకూల పరిణామాల్ని తీసుకొచ్చింది. మరోవైపు ఇరాన్‌పై ఇన్ని రోజులు ఉన్న ఆంక్షల్ని కూడా అమెరికా సడలించింది. ఇరాన్ చమురు క్రయవిక్రయాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో మార్కెట్లో చమురు లభ్యత పెరిగి ధర తగ్గుతోంది. అయినప్పటికీ సామాన్య వినియోగదారులకు వెంటనే ఊరట కలగకపోవచ్చని భావిస్తున్నారు. క్రూడాయిల్ ధరలు తగ్గినా దేశీయంగా చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ రేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశాలు ఉండవని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల యుద్ధం సమయంలో మే నెలలో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధర లీటరుకు సగటున రూ. 7.50 వరకు పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 115.73 గా ఉండగా, డీజిల్ లీటరుకు రూ. 103.82 గా ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్‌లోనే ఇంధన ధరలు అధికంగా ఉన్నాయి.

# రాజ్యసభలో కోటీశ్వరులు..



- రూ.5,300 కోట్లతో బీఆర్ఎస్ ఎంపీ టాప్..
- రాజ్యసభ సభ్యుల సగటు ఆస్తి విలువ రూ.115 కోట్లకు పైమాటే
- 31 శాతం మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్న ఏడీఆర్ నివేదిక
- రూ.5,300 కోట్ల ఆస్తితో బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి అత్యంత ధనవంతుడు
- తెలంగాణకు చెందిన ఏడుగురు ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ.8,310 కోట్లు
- 36 మంది ఎంపీలపై హత్య, హత్యాప్రయత్నం వంటి తీవ్రమైన కేసులు

✍ జయభేరి, న్యూఢిల్లీ:

రాజ్యసభ సభ్యుల ఆర్థిక, నేర చరిత్రపై అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన తాజా నివేదికలో పలు కీలక, ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలోని పెద్దల సభలో అత్యధిక సంపన్నులతో పాటు తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నారని ఈ నివేదిక స్పష్టం చేసింది. మొత్తం 233 మంది సభ్యులకు గాను 226 మంది సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఈ విశ్లేషణ జరిగింది. నివేదిక ప్రకారం ఈ 226 మంది ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ.26,047 కోట్లుగా ఉంది. సగటున ఒక్కో ఎంపీ ఆస్తి రూ.115 కోట్లకు పైగా ఉండటం గమనార్హం. వీరిలో 31 మంది ఎంపీలు (14శాతం) రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న బిలియనీర్లుగా ఉన్నారు. మరోవైపు కేవలం నలుగురు ఎంపీలు మాత్రమే తమ ఆస్తుల విలువ రూ.20 లక్షల లోపు ఉన్నట్లు ప్రకటించారు. సుమారు 100 మంది ఎంపీల ఆస్తులు రూ.10 కోట్లకు పైగా ఉండగా, 41 మందికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల మధ్య, 66 మందికి రూ.1 కోటి నుంచి రూ.5 కోట్ల మధ్య ఆస్తులున్నాయి.

ఆస్తులతో పాటు ఎంపీల నేర చరిత్రను కూడా ఏడీఆర్ విశ్లేషించింది. విశ్లేషించిన వారిలో 69 మంది ఎంపీలపై (31 శాతం) క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరిలో 36 మంది ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే అవకాశం ఉన్న తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఒక ఎంపీపై హత్య కేసు (సెక్షన్ 302), మరో నలుగురిపై హత్యాప్రయత్నం (సెక్షన్ 307) కేసులు ఉన్నాయి. ఇంకో నలుగురు ఎంపీలపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. పార్టీల వారీగా చూస్తే.. బీజేపీకి చెందిన 107 మంది ఎంపీలలో 28 మందిపైనా, కాంగ్రెస్‌కు చెందిన 29 మందిలో 12 మందిపైబా క్రిమినల్ కేసులు ఉన్నాయి. టీడీపీకి చెందిన నలుగురిలో ముగ్గురిపై, బీఆర్ఎస్ కి చెందిన ముగ్గురు ఎంపీలపైనా కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ (9 మందిలో 2), డీఎంకే (8 మందిలో 2), సమాజ్‌వాదీ పార్టీ (4 మందిలో 2), సీపీఎం (ముగ్గురిలో ముగ్గురు), ఆర్జేడీ (ముగ్గురిలో ఇద్దరు) చొప్పున క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎంపీలు ఉన్నారు. రాష్ట్రాల వారీగా సంపద కేంద్రీకరణలో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. రాష్ట్రానికి చెందిన ఏడుగురు ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ.8,310 కోట్లు కాగా, వారిలో నలుగురు బిలియనీర్లు ఉన్నారు. వ్యక్తిగతంగా చూస్తే, బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రూ.5,300 కోట్లకు పైగా ఆస్తులతో దేశంలోనే అత్యంత సంపన్న రాజ్యసభ సభ్యుడిగా నిలిచారు. పంజాబ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాజిందర్ గుప్తా (రూ.5,053 కోట్లు), కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ (రూ.2,558 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మరోవైపు ఆప్ ఎంపీ సంత్ బల్బీర్ సింగ్ కేవలం రూ.3.79 లక్షల ఆస్తితో జాబితాలో అట్టడుగున ఉన్నారు. కొంతమంది ఎంపీలకు ఆస్తులతో పాటు భారీగా అప్పులు కూడా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. జార్ఖండ్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పరిమళ్ నత్వానీకి రూ.755 కోట్ల ఆస్తులుండగా, అత్యధికంగా రూ.256 కోట్ల అప్పులు ఉన్నాయి. ఏపీ చెందిన టీడీపీ ఎంపీ బి. రామకృష్ణ రూ.672 కోట్ల ఆస్తులు, రూ.200 కోట్లకు పైగా అప్పులు ఉన్నట్లు ప్రకటించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్‌కు రూ.1,578 కోట్ల ఆస్తులు, రూ.149 కోట్లకు పైగా అప్పులు ఉన్నట్లు తెలిపారు.

## తెలంగాణలో కొత్త పింఛన్ల జారీ

కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. కొంతమంది అర్హత లేకపోయినా పింఛన్ పొందుతున్నారు. అలాగే మరణించినవారు, వలస వెళ్లిపోయినవారు, వేరే ప్రాంతాల్లో స్థిరపడినవారు కూడా ఉన్నారు. దీని వల్ల నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, లబ్ధిదారుల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో నిజమైన లబ్దిదారులకు మాత్రమే పింఛన్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థను రంగంలోకి దింపింది. ఈ సంస్థ లైవ్ అథెంటికేషన్ సర్వే చేపడుతోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అనర్హులను గుర్తిస్తోంది. రాష్ట్రంలో మొత్తం 42 లక్షల మంది పింఛన్లు పొందుతున్నారు. వీరిలో బ్యాంక్ అకౌంట్లలో నేరుగా పింఛన్లు పొందుతున్నవారు 19,04,239 మంది ఉన్నారు. వీరిలో 93,624 మందిని అనర్హులుగా గుర్తించింది. 40,751 మంది మరణించగా.. వీరి పేరిట ఇంకా నిధులు విత్ డ్రా అవుతున్నట్లు తేలింది. 41,689 మంది ఆచూకీ లభించడం లేదు. 3,495 మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా.. 11 వేల మంది ఆధార్లు చెల్లకపోగా.. వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి. ప్రస్తుతం 15.97 లక్షల మంది సర్వే పూర్తి చేశారు. ఈ నెలాఖరు నాటికి 100 శాతం సర్వే పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పెన్షన్లలో పారదర్శకత తెచ్చేందుకు ఈ మెగా సర్వే చేపడుతున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కాగా పింఛన్లను బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు పోస్టాఫీసుల ద్వారా పింఛన్లను అందించేవారు. అయితే ఇక నుంచి నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ఇటీవల అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు.

# నిష్పక్షపాతంగా సర్ ప్రక్రియ

- అధికారులను కోరిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 25 :**



ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి అధ్యక్షుడు బీర్ల ఐలయ్య అధికారులను కోరారు. యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం ప్రారంభించిన ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సీరివిజన్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక పరిశీలన ప్రక్రియను ఆయన పరిశీలించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని 142,144 బూత్ లో సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితాలను పరిశీలించారు, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో నమోదు కావడం, మరణించినవారి పేర్లు లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను సరిచేయడం వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఓటరు జాబితా ఎన్నికల ప్రక్రియకు పునాది అని పేర్కొన్న బీర్ల అయిలయ్య, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా ఎంతో అవసరమని అన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, అవసరమైతే కొత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట తహసీల్దార్ గణేష్ నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ యాదవ్, యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టీఏ మెంబర్ ఆకుల నర్సింహా, యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణీ భరత్ గౌడ్, కౌన్సిలర్లు, బూడిద మధు, ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, బిట్లు సరోజ, కోఆప్షన్ సభ్యులు గౌళికార్ అరుణ, రహీమా తదితరులు పాల్గొన్నారు.

# ఖ్యాతి గడించిన స్వాతి గిరి ప్రదక్షిణ

- దారి పొడవునా శ్రీనృసింహుని నామస్మరణ
- భక్తజన సంద్రంగా.. సాగిన గిరి ప్రదక్షిణ మార్గం

**జయభేరి, యాదగిరిగుట్ట :**





భక్తుల కొంగు బంగారమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా గురువారం ఉదయం 6 గంటలకు భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారి జన్మ నక్షత్రం పుస్కరించుకొని కొండపైన దేవాలయంలో ప్రత్యేకంగా అష్టోత్తర శతఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు.

కొండ దిగువన శ్రీ స్వామి వారి పాదాలుగా పిలువబడే వైకుం ఈ ద్వారం వద్ద తొలుత ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంబించారు. శ్రీ స్వామి వారి నామస్మరణతో పాటు భజనలు,కీర్తనలు, భరత నాట్యాలు, భాజ భజంత్రీలతో దారి పొడవునా ఒక ఆధ్యాత్మిక ప్రవాహంలా గిరి ప్రదక్షిణ కొనసాగింది. దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర కొండ చుట్టూ తిరిగిన తర్వాత.. మళ్లీ అదే ప్రారంభమైన వైకుంత ద్వారం వద్ద ముగించారు. అనంతరం కొండపైకి వెళ్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రతి నెల స్వాతి నక్షత్ర గిరి ప్రదక్షణలో పాల్గొనే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. అనాదిగా గిరి ప్రదక్షణ కార్యక్రమం ఉన్నప్పటికీ అంతగా ప్రాచుర్యంకు నోచుకోలేదు. ఇటీవలి కాలంలో గిరి ప్రదక్షిణకు భారీ స్పందన కనిపిస్తోంది.



## బాగున్నారా.. ఎమ్మెల్యే సార్..

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం మీన్గవానిపల్లిలో గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ను ఓ చిన్నారి దగ్గరికి వచ్చి నమస్కరించింది. అనంతరం తమ గ్రామానికి వచ్చినందుకు థాంక్యూ ఎమ్మెల్యే సార్ అని పలకరించింది. దీంతో ఎమ్మెల్యే కూడా ఆ చిన్నారిని దగ్గరికి తీసుకొని కుశల ప్రశ్నలు వేశారు. ఆప్యాయతతో దగ్గరికి తీసుకొని పలకరించారు.ఈ దృశ్యం అక్కడున్న వారిని ఎంతగానో ఆకట్టుకుంది.

## మూడు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన భాస్కర్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం గోరకొండ, నార్లోనికుంట, చిన్న రాజమూర్ గ్రామాలలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్వాహకులకు భాస్కర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తమ కుటుంబం తరపున ఇందిరమ్మ ఇళ్ల నిర్వాహకులకు నూతన వస్త్రాలు అందజేశారు. అలాగే పలు వివాహ శుభ కార్యాలలో కూడా భాస్కర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## కేంద్ర కేబినెట్‌లో భారీ మార్పులు..

- 38 మంది మంత్రుల పై వేటు

కేంద్ర మంత్రివర్గంలో త్వరలోనే భారీ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు జాతీయ రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులను తప్పిస్తారని సమాచారం. అలాగే ఎన్నికల దృష్ట్యా కీలక రాష్ట్రాలకు చెందిన ఎంపీలకు మంత్రి పదవులు కట్టబెట్టే వ్యూహాన్ని బీజేపీ అమలు చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దాదాపు 38 మంది మంత్రుల బాధ్యతల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. శ్రీకాంత్ షిండే, ఈటల రాజేందర్, డీకే అరుణ, కకోలీ ఘోష్ వంటి నేతలకు అవకాశాలు దక్కవచ్చని సమాచారం.

# ఆప్యాయ పలకరింపులు.. ఆత్మీయ సన్మానాలు..

- ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడికి ఘన స్వాగతం పలికిన ప్రజలు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లోని ఆయా గ్రామాలలో గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి సుడిగాలి పర్యటన జరిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ పూజా కార్యక్రమాలకు భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున నూతన వస్త్రాలు అందజేసి భాస్కర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వారికి కుశల ప్రశ్నలు వేసి కాసేపు వారి ఇండ్లలో జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఎంతో ఓపికతో పాల్గొన్నారు. అలాగే పలు వివాహ వేడుకల్లో కూడా భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పలు గ్రామాలకు హాజరైన భాస్కర్ రెడ్డికి ఆయా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు కప్పి సన్మానించారు.ఆయా గ్రామాలకు వచ్చిన సందర్భంగా ప్రజలతో భాస్కర్ రెడ్డి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంతో ఆప్యాయతతో వారిని పలకరించారు. కొంతమంది వృద్ధులు భాస్కర్ రెడ్డికి వద్దకు వచ్చి పలకరించి ఆశీర్వదించారు. అన్నకు తగ్గ తమ్ముడు అంటూ అభినందించారు. తమ దగ్గరికి వచ్చిన వారిని ఆప్యాయతో పలకరించి నవ్వుతూ భాస్కర్ రెడ్డి అక్కున చేర్చుకున్నారు. తమకు ఈ విధంగానే మీ వంతు సహాయ సహకారాలు అందించాలని భాస్కర్ రెడ్డి వారిని కోరారు

# ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం

- దేవరకద్ర ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**



ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి. భాస్కర్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం పర్దిపూర్ లో గురువారం పలు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తుందన్నారు. అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందించి అండగా నిలవాలని భాస్కర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలు వివాహాలకు కూడా ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిన్న చింతకుంట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.వెంకటేష్ యాదవ్ తో పాటు మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్లగొండకు ముఖ్యమంత్రి

- 13వేల కోట్ల వ్యయంతో నిర్మించే R&B హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం
- సిఎం పర్యటన సందర్భంగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**జయభేరి, నల్లగొండ, జూన్ 25 :**

ఈనెల 28న నల్లగొండకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో బయలుదేరి నల్లగొండ జిల్లా కనగల్ మండలం చేరుకొని...మొదటగా... మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో... కనగల్ మండలం AMC మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన "హ్యామ్" రోడ్ల పైలాన్ ను ఆవిష్కరించనున్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో మొదటి ఫేజ్ డ్రింకింగ్ వాటర్ అందించే పనులకు శంకుస్థాపన చేయనున్న సిఎం ఎన్జీ కాలేజి గ్రౌండ్స్ లో జరిగే భారీ బహిరంగ సభకు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం... అనంతరం SHG మహిళా సంఘాలకు చెక్కులు అందజేయనున్నారు.




## ముఖ్యమంత్రి ఫ్యామిలీ డ్రైవర్ వివాహ వేడుకలో పాల్గొన్న ప్రశాంత్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కింగ్స్ గార్డెన్ లో గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యామిలీ డ్రైవర్ మల్లికార్జున్ యాదవ్ వివాహ వేడుకకు దేవరకద్ర నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు 'సర్' ప్రక్రియను పర్యవేక్షించాలి

- ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

'సర్' ప్రక్రియను ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్యవేక్షించాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సూచించారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ లో గురువారం తమ నివాసానికి వచ్చిన బూత్ లెవెల్ అధికారులు అడిగిన సమాచారం, డాక్యుమెంట్లను ఎమ్మెల్యే సమర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్కరు ఈ ప్రక్రియలో పాల్గొనాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సర్ అంశం చాలా సీరియస్ అంశమని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండి బిఎల్వోలకు సహకరిస్తూ ఓటర్ల నమోదు మార్పులు, చేర్పులు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో అర్హులైన ఏ ఒక్క ఓటరు వారి యొక్క ఓటర్ హక్కు కోల్పోకుండా అప్రమంతంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల లోని ఇంపీరియల్ గార్డెన్ లో గురువారం జరిగిన నాగయ్య కుమార్తె వివాహ వేడుకల్లో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కౌకుంట్ల సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్



**జయభేరి, దేవరకద్ర :**

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కౌకుంట్ల సర్పంచ్ ఉల్లినరేష్ కుమార్ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల మండల కేంద్రంలో గురువారం సుంత్రమోని బోజమ్మ, పాపిగాని శారద ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహాల గృహప్రవేశ కార్యక్రమంలో కౌకుంట్ల సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ పాల్గొని లబ్ధిదారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ ప్రసంగించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడు తుందన్నారు.ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కిషన్ రావు,ఎంపీడీవో శివప్రసాద్, తహసిల్దార్ సుందర్ రాజ్, ఎంపీఓ రమేష్, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, ఏపీఓ, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు బెందుల ప్రభు, వార్డు సభ్యులు బాలన్న, శ్రీ కావలి లక్ష్మణ్ తదితరులు పాల్గొని లబ్ధిదారులను అభినందించారు.



## ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్‌లో స్కూల్ బస్సుల భద్రత తనిఖీలు

- విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ శంకరయ్య

జయభేరి, షాద్ నగర్, జూన్ 25 :

విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ షాద్‌నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య ట్రాఫిక్ సిబ్బంది బృందం ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్‌లో స్కూల్ బస్సుల భద్రతా తనిఖీలు, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, రోడ్డు యోగ్యత, వాహన పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, అత్యవసర భద్రతా పరికరాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే బస్సు డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు మరియు ఇతర సంబంధిత పత్రాలను తనిఖీ చేశారు. ప్రతి బస్సులో విద్యార్థుల భద్రత కోసం అటెండర్లు/హెల్పర్లు విధుల్లో ఉన్నారో లేదో పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల యాజమాన్యానికి రోడ్డు భద్రతపై తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాల రవాణా భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా బస్సు డ్రైవర్లు, అటెండర్లు విద్యార్థుల రవాణా సమయంలో అప్రమత్తంగా ఉండి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ అధికారులు సూచించారు. విద్యార్థుల భద్రతే లక్ష్యం స్కూల్ బస్సులపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు చేస్తున్నట్లు ట్రాఫిక్ సిఐ పేర్కొన్నారు.

## వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల



జయభేరి, పరవాడ:

పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం వాడ చీపురుపల్లి గ్రామంలో అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు ,పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రారంభించారు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి సాగులో నష్టాలు రాకుండా చూడాలని అదే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. ఎరువులు విత్తనాలు సకాలంలో సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రైతులు వ్యవసాయ అధికారులు చెప్పే సలహాలు పాటించి ఆధునిక పద్ధతుల్లో పంటలు వేయాలని సూచించడం జరిగినది మన రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నాణ్యమైన విత్తనాలు సకాలంలో ఎరువులు గిట్టుబాటు ధర అవే కూటమి ప్రభుత్వం విధానం అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసవరపు అప్పలనాయుడు,కూటమి నాయుకులు కన్నూరు వెంకటరమణ,వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో నిర్మించిన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



జయభేరి, పరవాడ:

పరవాడ మండలంలోని వాడ చీపురుపల్లి గ్రామ పంచాయతీ దళాయిపాలెం గ్రామంలో ఎన్టీపీసీ సిఎస్ఆర్ నిధులు 25 లక్షల రూపాయలతో కమ్యూనిటీ హాల్ నిర్మించడం జరిగింది. అదేవిధంగా నాయుడు పాలెం గ్రామ పంచాయతీ ,నాయుడుపాలెం గ్రామంలో 50 లక్షల రూపాయలతో నిర్మించిన బీసీ బాలికల హాస్టల్ భవనాలను జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్‌కుమార్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచాకర్ల మాట్లాడుతూ స్థానికులకు పరవాడ ఫార్మా కంపెనీలలో అలాగే ఎన్టీపీసీ లో ఉద్యోగ అవకాశాలు ఖచ్చితంగా కల్పిస్తామని,ఇప్పటికే కొన్ని ఉద్యోగాలు వెయ్యడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయుకులు మాజీ జడ్పీటీసీ పయిల జగన్నాధరావు,మాజీ ఎంపీపీ మసవరపు అప్పలనాయుడు తదితర నాయుకులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవనానికి భూమి విరాళం

జయభేరి, తుర్కపల్లి, జూన్ 21 :

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన బొత్తా ఫౌండేషన్ చైర్మన్, కీర్తిశేషులు బొత్త వెంకటేష్ గ్రామంలో మహిళ సంఘ భవన నిర్మాణానికి 100 గజాల స్థలాన్ని విరాళంగా అందజేసినట్లు గ్రామ సర్పంచ్ బొత్త రాములు తెలిపారు. గురువారం మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రతినెల సంఘ బంధాల సమావేశాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం చాలా ఉపయోగపడుతుందని అన్నారు. బొత్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు, పంచాయతీ కార్యదర్శి ధార మహేందర్, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటర్ల జాబితాయే ప్రజాస్వామ్యానికి పునాది

జయభేరి, పరకాల, జూన్ 25:



పరకాల పట్టణంలోని 56వ బూత్ లో"సర్" కార్యక్రమాన్ని పరిశీలలో భాగంగా భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన (ఎస్ ఐఆర్) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు పారదర్శక ఓటర్ల జాబితాయే ప్రజాస్వామ్యానికి పునాదిగా మారుతుందన్నారు. సర్ తో నిజమైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందీలేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యత ఎఐసిసి అధినేత రాహుల్ గాంధీ సూచన ప్రాయంగా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ఆదేశానుసారంగా మనం ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధం అని, ఈ పక్రియ పారదర్శకంగా నిష్పక్షపాతంగా సర్ సవరణ జరిగేలా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ పరకాల 56వ బూత్ లో ఎస్ ఐ అర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలని కోరారు. అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున కూడా ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకునేలా మన ఏజెంట్లు నిరంతరం పర్యవేక్షింస్తూ ఓటర్ల సవరణ లేదా నమోదు ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మనం సహాయపడాలన్నారు. మన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్యంగా బూత్ లెవల్ ఏజెంట్లు ప్రతి బూత్ పరిధిలో ఇళ్లను సందర్శించి ఓట్ల వివరాలను పరిశీలిస్తూ పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల జిపిఓ షాకీర్, బి ఎల్ ఓ కోడెపాక పూర్ణిమ, 56వ బూత్ బి ఎల్ ఏ బొమ్మకంటి చంద్రమౌళి, పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు బొచ్చు జెమిని, ముచర్ల సంపత్, బొచ్చు సంపత్, బొచ్చు కృష్ణ, బొచ్చు నరేందర్ , బొచ్చు వరప్రసాద్ అంగన్వాడీ టీచర్ ఎలిజబెత్ , ఒంటేరు పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరిపై ఆరోపణలు సరికావు

- బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేసే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ
- గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ నల్లా నరేందర్

జయభేరి, గజ్వేల్, జూన్ 25 :




సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లురి లక్ష్మణ్ పై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ హెచ్చరించారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాంఘిక గురుకుల పాఠశాలల్లో అవినీతి జరుగుతోందంటూ మంత్రి లక్ష్మణ్‌పై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ కుట్రలో భాగమని మండిపడ్డారు. మాదిగ జాతికి చెందిన వ్యక్తికి మంత్రి పదవి రావడం సహించలేకనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. అత్యంత పేదరికం నుంచి ఎదిగి మంత్రి స్థాయికి చేరుకున్న అడ్లురి లక్ష్మణ్‌పై వ్యక్తిగతంగా దూషణలు చేయడం తగదన్నారు.బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేసే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ దళితుల పేరుతో రెండు సార్లు అధికారంలోకి వచ్చి దళితులకు న్యాయం చేయలేదని విమర్శించారు.మాదిగ జాతికి అవకాశాలు వచ్చినప్పుడు ఎవరైనా కించపరిచే ప్రయత్నం చేస్తే మాదిగ హక్కుల దండోరా చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మంత్రి అడ్లురి లక్ష్మణ్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జాతీయ సమన్వయ కర్త (మహిళా విభాగం) అందెల భవాని రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మేతరీ రోజరాణి, ములుగు మండల అధ్యక్షులు మైలారం సత్యనారాయణ, క్షీరాసాగర్ గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు గుడ్ల పర్శురామ్, దసర్లపల్లి నగేష్, చెట్లపల్లి ప్రదీప్, నల్ల ప్రవీణ్, బొడ్డు లింగం, గొంగటి కృష్ణ, గుడ్ల చంద్రయ్య, రాజు, మాదిగ హక్కుల దండోరా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజన్ని నిర్మిద్దాం

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి
- అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

జయభేరి, పరకాల, జూన్ 25:




అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో పట్టణములో గల అన్నీ విద్య విద్యాసంస్థల విద్యార్థులతో పరకాల పోలీస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద మారక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ మరియు మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని కోరారు. "డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం" అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమము లో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పరకాల క్రాంతి కుమార్, ఎస్.ఐ. పవన్ పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బొత్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సంఘ భవనానికి భూమి విరాళం

జయభేరి, తుర్కపల్లి, జూన్ 21 :



తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన బొత్తా ఫౌండేషన్ చైర్మన్, కీర్తిశేషులు బొత్త వెంకటేష్ గ్రామంలో మహిళ సంఘ భవన నిర్మాణానికి 100 గజాల స్థలాన్ని విరాళంగా అందజేసినట్లు గ్రామ సర్పంచ్ బొత్తరాములు తెలిపారు. గురువారం మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రతినెల సంఘ బంధాల సమావేశాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం చాలా ఉపయోగపడుతుందని అన్నారు. బొత్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు, పంచాయతీ కార్యదర్శి ధార మహేందర్, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ రూమ్ పేరిట మోసాలు

- ముగ్గురు అరెస్టు

జయభేరి, మల్కాజ్ గిరి

సికింద్రాబాద్.. అల్వాల్ పీఎస్ పరిధిలో రెండు పడక గదుల ఇళ్లను ఇప్పిస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసారు. పుష్పలత, విశాల్, మహేందర్ సింగ్‌లను అరెస్టు చేశాం. మరో నలుగురి కోసం గాలిస్తున్నామని డీసీపీ శ్రీధర్ వెల్లడించారు. అల్వాల్ లో ఉండే జయరాజ్ ప్రభుత్వ కార్యాలయాలలో పైరవీలు చేస్తూ ఉంటాడు. పుష్పలత గతంలో జి.హెచ్.ఎం.సి లో విధులు నిర్వహించేవారు. జయరాజ్ ,పుష్పలత కలిసి ప్రజలకు రెండు పడక గదుల ఇళ్ళు ఇస్తామని నమ్మించారు. అదే అదునుగా తీసుకుని అల్వాల్ పరిధిలో పరిచయమున్న వ్యక్తులకు లక్ష రూపాయలకే ఇళ్లు ఇస్తామని నమ్మించారు. దాదాపు 2023 నుండి 99 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారని అయన అన్నారు. పలు దఫాలుగా వీరి నుండి డబ్బులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సంప్రదించగా వీరికి రెండు పడక గదుల ఇళ్ళు కేటాయించలేదని తేలడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో పారదర్శకత ఉంటుంది కాబట్టి ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని అయన సూచించారు.

## కెరియర్ కౌన్సెలింగ్ అవగాహన కార్యక్రమం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల దేవరకొండ లో కెరీర్ కౌన్సిలింగ్ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీమతి బి.అలివేలు JL in జువాలజీ అండ్ కౌన్సిలింగ్ తెరపిస్ట్ ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థినిలకు భవిష్యత్తు పై అవగాహన, చదువు యొక్క విలువ అభివృద్ధి, మహిళా యొక్క విలువ వారు ఎదుర్కొనే సమస్యలను గురించి విద్యార్థినిలకు కౌన్సిలింగ్ ద్వారా తెలియజేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ ,అధ్యాపక బృందం విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలు వద్దు.. పరిష్కారమే కావాలి

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ పనులు దక్షిణ భారతదేశ జలవనరుల చరిత్రలో ఒక అపూర్వ ఘట్టమని, గురువారం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని మునీరాబాద్‌లో సభలో ఆయన మాట్లాడారు. తుంగభద్ర డ్యామ్ గేట్ల పునరుద్ధరణ మూడు రాష్ట్రాల్లోని కరువు జిల్లాల సమస్యల పరిష్కారానికి పడిన బలమైన అడుగు అని పేర్కొన్నారు.

# ఓటరు జాబితా సమగ్ర సవరణ షురూ

- మేడ్చల్ సర్కిల్‌లో ఇంటింటికీ ఓటరు జాబితా సమగ్ర సవరణ
- బీఎల్‌వో ఇంటికి వస్తే అవసరమైన వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలి

**జయభేరి, మేడ్చల్, జూన్ 25:**

సమగ్ర, పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ సర్కిల్ పరిధిలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలను ఈ సందర్భంగా పరిశీలిస్తున్నారు.

**బీఎల్‌వో ఇంటికి వస్తే ఏ సమాచారం ఇవ్వాలి**

బీఎల్‌వో ఇంటికి వచ్చిన సమయంలో కుటుంబ సభ్యులందరి ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సమాచారం అందించాలి. ముఖ్యంగా పేరు, తండ్రి లేదా భర్త పేరు, జనన తేదీ, చిరునామా, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ (స్వచ్ఛందంగా మాత్రమే), కుటుంబ సభ్యుల వివరాలు సరైనవో కాదో నిర్ధారించాలి. అలాగే కొత్తగా 18 ఏళ్లు నిండిన వారి వివరాలను కూడా బీఎల్‌వోకు తెలియజేయాలి.

**ఓటు నమోదు ఎలా చేసుకోవాలి**

2026 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారత పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హుడు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం 6ను భర్తీ చేసి బీఎల్‌వోకు అందజేయవచ్చు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తుతో పాటు వయస్సు, చిరునామా ధ్రువీకరణ పత్రాల ప్రతులను జత చేయాల్సి ఉంటుంది.






**ఓటరు జాబితాలో పేర్లు తప్పుగా ఉంటే ఏం చేయాలి**

ఓటరు పేరు, వయస్సు, ఫోటో, చిరునామా లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే వాటిని సవరించుకునే అవకాశం ఉంది. ఇందుకోసం సంబంధిత సవరణ ఫారాన్ని భర్తీ చేసి బీఎల్‌వో లేదా ఎన్నికల నమోదు అధికారికి సమర్పించాలి. అవసరమైన ఆధార పత్రాలను జతచేస్తే సవరణ ప్రక్రియ చేపడతారు.

**ఓటరు జాబితా సవరణ ఫారం ఎలా నమోదు చేసుకోవాలి?**

ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు లేదా చిరునామా మార్పు కోసం ఫారం 8ను ఉపయోగించాలి. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం 6, ఒక నియోజకవర్గం నుంచి మరొక ప్రాంతానికి మారిన సందర్భంలో కూడా సంబంధిత ఫారాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఫారాలను బీఎల్‌వో వద్ద పొందడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చు.

**ప్రజలు సహకరించాలని అధికారుల విజ్ఞప్తి**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ద్వారా ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించడం, తప్పులను సవరించడం లక్ష్యంగా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. బీఎల్‌వోలు ఇంటింటికీ వచ్చే సమయంలో ప్రజలు సరైన సమాచారం అందించి సహకరించాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు. ఈ సమగ్ర సవరణ కార్యక్రమం పూర్తయ్యాక తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని అధికారులు సూచిస్తున్నారు.




## పోలీస్ శాఖ యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**

వాడచీపురుపల్లి గ్రామంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నశా ముక్త్ భారత్ అభియాన్ వారోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం వాడచీపురుపల్లి గ్రామంలో పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ లంకా భాస్కరరావు ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు నివారణ చర్యల గురించి వివరించారు. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీయడంతో పాటు కుటుంబం, సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. అనుమానాస్పద మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగం గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అలాగే యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి మరియు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ భీమరాజు గ్రామ పెద్దలు, యువత మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన తహసిల్దార్



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 25 :**

తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు మల్కాపురం, మాదాపురం, గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నేటి నుండి సర్ ప్రక్రియ ప్రారంభమైందని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై బి ఎల్ ఓ లతో కలిసి ఎన్యుమరేషన్ ఫారంలను ఓటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నేటి నుండి సర్ ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అర్హులైన ప్రతి పౌరునికి ఓటరు జాబితాలో చేర్చి, అనార్హులను జాబితా నుండి లేకుండా ఉండేందుకు జూన్ 25 నుండి జూలై 24 వ తేదీ వరకు బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ పారాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తిరిగి వాటిని పూర్తిచేసి ఇవ్వాలని అన్నారు. ఈ ప్రక్రియను బిఎల్వోలు పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు పాల్గొన్నారు.


## ఆల్ ఇండియా సైనిక్ స్కూల్లో సీటు సంపాదించిన పల్లె పహాడ్ విద్యార్థి



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 21 :**

తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివిన గూగుల్ గుట్ట తండా కు చెందిన ధరావత్ విజయ్ నాయక్ కుమారుడు ధరావత్ హర్షిత్ నాయక్ ఆల్ ఇండియా సైనిక్ స్కూల్లో సీటు సంపాదించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించి సన్మానించారు. జీవితంలో మరెన్నో విజయాలు సాధించి కుటుంబానికి, గ్రామానికి మార్గదర్శకం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాంగల పవనీత బాలకృష్ణ, మాజీ సర్పంచ్ సొక్కుల మోహన్ రెడ్డి, మోతిరామ్ తండా మాజీ సర్పంచ్ ధరావత్ నరసింహ నాయక్, సొక్కుల బాల్రెడ్డి, సోక్కుల పాపిరెడ్డి ,భాస్కర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గౌరీనాథ్, రాళ్ల బండి సుగ్రీవ చారి, ఉపాధ్యాయులు, బి ఎల్ ఓ లావూరి తిరుపతి నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తుడుం గణేష్



**జయభేరి, మేడ్చల్, జూన్ 25:**

నగరంలో ఓ కార్యక్రమానికి హాజరైన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మేడ్చల్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు,మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ను శాలువతో సత్కరించారు. అనంతరం చిట్ చాట్ లో స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై స్వల్పంగా చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు ముదిరాజ్, భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## సర్పంచ్ ఆధ్వర్యంలో ఓటర్లకు SIR ఫామ్

**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రం చేపటినట్టువంటి SIR ప్రత్యేక సమగ్రా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఓటర్ వివరాలు మరియు ధృవీకరణ మార్పులు కొత్త వివరాలు నమోదు గురుంచి గుడిపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో ఓటర్లకు SIR ఫామ్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమాలో అసిస్టెంట్ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ దీవెన మధుహాసిని, సూపర్వైజర్ MD ఫసహాద్‌అలీ ఆపరేటర్ వివేక్ BLO ఎర్ర అలివేలు గుడిపల్లి గ్రామ కార్యదర్శి విజయ్ రెడ్డి ఏడవ వార్డు సభ్యులు ఎర్ర వంశీకృష్ణ గ్రామ ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

## బోడ్రాయి పండుగ మహోత్సవం



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండల పరిధిలోని తెల్దేవరపల్లి గ్రామానికి చెందిన గ్రామ ఉప సర్పంచ్ బొంగరాల విజయ శాంతి గణేష్ ఆహ్వానం మేరకు బోడ్రాయి పండుగ మహోత్సవం లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ ఈ కార్యక్రమంలో మాజీ mpp పార్వాతి చందు నాయక్, మాజి zptc ముఖ్య సలహాదారులు మోహన్ కృష్ణ నాయక్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కేతావత్ లక్ష్మణ్ నాయక్,చిత్రియాల సర్పంచ్ చిరంజీవి, పోలేపల్లి సర్పంచ్ నోముల శ్రీనయ్య,గాగిళ్ళ పురం సర్పంచ్ నాగార్జున, పోలేపల్లి ఉప సర్పంచ్ రమేష్,మైనం అంజి,మద్దిమడుగు అంజి,మైనం శివ,తదితరులు పాల్గొన్నారు.

## సాయి కృష్ణ కేసు ఈనెల 29 కు వాయిదా


**జయభేరి, విజయవాడ :**

గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి పిటిషన్పై జిల్లా కోర్టు గురువారం విచారణ జరిపింది. జ్యుడీషియల్ విచారణ కోరుతూ సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. విజయలక్ష్మి తరుపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. కృష్ణలంక స్టేషన్, స్వర్గపురి లో సిసి ఫుటేజ్ మాయంపై న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. సీఐ నాగరాజుపై పటమట సీఐ విచారణ చేయటంపై అభ్యంతరం తెలిపారు. సాయికృష్ణ మృతదేహం ఏమైందో ఇప్పటికీ రిమాండ్ రిపోర్ట్ లో పేర్కొనలేదని అన్నారు. రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు పలు అంశాలు పేర్కొనలేదని వాదించారు. సిసి కెమెరా ఫుటేజ్ కోసం డిస్టిక్ లెవెల్ కమిటీకి కోర్టు నోటీసులు జారీచేసింది. విజయవాడ పోలీస్ కమిషనర్,విఎంసి కమిషనర్, కలెక్టర్ కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 29 కు వాయిదా వేసింది.

## మేడ్చల్ డివిజన్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ

- మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్

**జయభేరి, మేడ్చల్, జూన్ 25:**



మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం మేడ్చల్ పట్టణంలోని ప్రాథమిక బాలికల పాఠశాల ఆవరణలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ, సోనియా గాంధీ స్ఫూర్తితో ఇందిరమ్మ పేరుతో మహిళలకు చీరలు అందజేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు సముచిత గౌరవం, ప్రాధాన్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేసినట్లు గుర్తు చేశారు. త్వరలో మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలను అప్పగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాల ద్వారా ప్రతి ఇంటిలో ఆనందం నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయగా, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు గుండ శ్రీధర్ కురుమ, కాంగ్రెస్ నాయకులు కుత్తడి నర్సింగ్‌రావు, పెగుడ శ్యాంరావు, చెవిటి అవినాష్, మహమ్మద్ అమీర్, అష్రఫ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**జయభేరి, మేడ్చల్, జూన్ 25:**



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గౌడవల్లి డ్వాక్రా భవనంలో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాలకుర్తి మురళి గౌడ్, గువ్వ సంధ్యారాణి, సురేష్ ముదిరాజ్, శంకూరి హరిశంకర్, దాసరి శారద, శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ఫోరం మాజీ అధికార ప్రతినిధి గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళా గ్రూపుల సభ్యులందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్, మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి, మాజీ సర్పంచ్ భగవాన్ దాసు, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వినోద్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు డి. గోపాల్, మాజీ వార్డు సభ్యుడు రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మహిళలకు ఇందిరమ్మ చీరలను సురేందర్ ముదిరాజ్‌తో కలిసి నాయకులు అందజేశారు.

## మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

- త్యాగానికి ప్రతీక మొహర్రం

**జయభేరి, కొండమల్లేపల్లి :**



మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం మొహర్రం సందర్భంగా కొండమల్లెపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.......కులాల మతలకు అతీతంగా జరుపుకునే పండుగ మొహర్రం అని ఆయన అన్నారు.ధర్మం, సత్యం, త్యాగానికి ప్రతీకగా మొహర్రం నిలుస్తుందని తెలిపారు. ఈ పవిత్ర మొహర్రం సందర్భంగా ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని అని ఆయన కోరారు. త్యాగాలను స్మరించుకుంటూ ముస్లిం సహోదరులు మొహర్రంను జరుపుకుంటారని అన్నారు. పీరీల పండుగ పేరుతో తెలంగాణ ప్రజలు సహోదర భావంతో, కులమతాలకు అతీతంగా పాల్గొంటారని అన్నారు. ఉత్సాహం, విషాదం కలగలిపి దూలలాడుతూ, నిప్పుల గుండం మీద నడుస్తూ, మత సామరస్యాన్ని చాటుతూ పల్లె నుండి పట్నం దాకా సాగే పీరీల వేడుక, గంగా జమున సంస్కృతికి అద్దం పడుతుందని అన్నారు. రాష్ట్రంలో లౌకికవాదానికి గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేయడం జరిగింది అని ఆయన అన్నారు. అనంతరం మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ని గ్రామస్తులు సన్మానించారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## దేవాలయ శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**జయభేరి, మాచవరం :**

పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం, పిన్నెల్లి గ్రామం నందు శ్రీ సీతారామ వేణుగోపాల స్వామి వార్ల నూతన దేవాలయం (పునర్నిర్మాణం) శంఖుస్థాపన సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాస రావు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో తులత ఎమ్మెల్యే యరపతినేని కొబ్బరికాయ కొట్టి శ్రీ సీతారామ వేణుగోపాల స్వామి వార్ల నూతన దేవాలయం (పునర్నిర్మాణం) నకు శంకుస్థాపన చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

